ఆదర్శం

పాలంకి సత్య

శనివారం సాయంత్రం రాధిక దగ్గరుండి పని మనిషి చేత ఇల్లు తుడిపిస్తోంది. పనిమనిషి జయ ఇల్లు తుడుస్తూ మాట్లాడు తోంది. రాధిక సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసరు. మామూలు రోజుల్లో నిలబడి పని చేయించుకుందుకు ఆమెకు కుదరదు.

ప్రొద్దుటే హడావుడిగా వంట. పెద్దమ్మాయిని స్కూలుకి పంపించి చిన్న పిల్లను క్రెష్‌లో దింపి ఆఫీసుకు వెళ్లాలి. అందుకే శలవు వున్నపుడు దగ్గర నిలబడి పని చేయించడం జరుగుతూ వుంటుంది. ఆ టైంలోనే తన కష్టం, సుఖం చెప్పు కుంటూ వుంటుంది జయ. తనకు మంచి అన్పించినవీ, జయ ఆచ రిస్తుందన్న నమ్మకం వున్నవీ సలహా లిస్తుంది రాధిక.

బెడ్రూం తుడుస్తూ అడిగింది "అమ్మా ఈ బీరువా ఎంత వుంటుంది? రెండు వేలకి వస్తుందా?"

"నేను కొన్నప్పుడు రెండువేలు. ఇపుడు మూడు వేల పైనే వుంటుందేమో. ఏం ఎందుకు?"

"ఈ నెలతో చీటీ అయి పోతుందమ్మా నెలకి రెండు వందలు. పది నెలలు అయింది. పది తారికుకి రెండు వేలొస్తుంది. నేనెప్పుడు పాడను. ఆ డబ్బుతో ఏమైనా కొనుక్కుంటా"

జయ కట్టే చీటీలు రాధికకు తెలుసు. నాలుగిళ్లలో పని చేస్తోంది. నలుగురూ నాలుగు వందలిస్తారు. మిగతా ముగ్గురు ఒకళ్లు బాంకులో, ఒకళ్లు పబ్లిక్ స్కూలులో, ఒకావిడ కంపెనీలో పని చేస్తున్నారు. జయ చాలా కష్టజీవి. తెలివైనది కూడా. నాలుగిళ్లో వాళ్ల వాళ్ల ఆఫీసు టైంలకి సరి పోయేలా తన టైం పెట్టుకుని ఎవరికీ కోపాలు రాకుండా పని చేస్తోంది. చంటిపాపను తల్లి దగ్గరుంచి ప్రొద్దుటే ఆరుగంటలకి వస్తుంది. పదిన్నర దాటాక ఇంటికి వెడు తుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు దాకా పని చేస్తుంది. ఎవ్వరికీ ఏ రోజూ మాన్పించాలని అన్పించేది కాదు.

"ఏమ్మా మాట్లాడడం లేదు"

రాధిక ఉలిక్కి పడింది.

"బీరువా మీదికి పోయిందేం మనస్సు"

"ఏముందమ్మా నలుగురూ నాలుగు కొత్త చీర లిస్తారు. నాలుగు పాత చీర లిస్తారు. పిల్లలవి పొట్టయిన బట్ట లిస్తారు. ఇంట్లో ఎలక లున్నాయమ్మ. బీరువా వుంటే దాచు కుంటాను. మూడు వేలంటు న్నారుగా ఇంకా వెయ్యి కావాలి టైం. ఎంతైందమ్మా"

శని వారం టి.వి సినిమా మిస్సవదు జయ.

"ఇంకా సినిమా టైం కాలేదుదే. పోనీ టీవీ కొనుక్కో, చిన్న టీవీలు నీ డబ్బుకు వస్తాయి".

జయ ఒక్కక్షణం తటపటాయించి అంది "వద్దులేమ్మా"

రాధిక ఇదివరలో జయకు బ్యాంకులో పొదుపు గురించి చెప్పడానికి ప్రయత్నించి విఫలు రాలైంది. తమ నలుగురు ఉద్యోగినులు కనుక ఈరోజు జీతాలు బాగానే ఇస్తున్నారు. తిండి, బట్ట కూడా బాగానే ఇస్తున్నారు కానీ రేపు దీనికి ఓపిక తగ్గితే పని మనిషిని మార్చేస్తారు కదా. అందుకే చీటీ కాకుండా రికరింగ్ డిపాజిట్ వేసుకోమని జయకు చెప్పింది. వృద్ధాప్యంలో పనికి వస్తుందని చెప్పింది. జయకు నచ్చ లేదు. మా బస్తీలో అంతా అన్నీ కొను క్కుంటారమ్మా అంది. రాధిక అందుకే ఇప్పుడు డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసుకో మన లేదు.

"పోనీలే బంగారం కొనుక్కో. చెవిదుద్దులు వస్తాయి"

"అమ్మా నా కష్టం ఎవరికి చెప్పుకోను. మా ఆయన తాగు బోతు. తను సంపాదించి పైసా ఇంట్లో ఇవ్వడు. నేను మీ ఇళ్లల్లో నుంచి పట్టు కెళ్లిన అన్నం తింటాడు. తను సంపాదించింది తాగేస్తాడు. నా పెండ్లికి మా అమ్మ నాకు చెవికి కమ్మలు పెట్టింది. కాళ్లకు వెండి పట్టీ లుండేవి. అన్నీ అమ్ము కున్నాడు. ఆఖరికి మా పాప కాళ్లకి కడియాలు వుండే అవి కూడా అమ్ము కున్నాడు. మా పాప పుట్టినపుడు ఎండలున్నాయని ఫాను తీసు కున్నాను. అది కూడా పై ఫానేనమ్మా. టేబిలు ఫానయితే తక్కువే. అయినా పట్టుకు పోయి అమ్ము కుంటాడని భయం. మీరిందాకా టీవీ అన్నారు కదా. చిన్న టీవీ అయితే పట్టుకు పోతాడు. బీరువా అయితే పట్టుకు పోలేడు కదా"

రాధిక తెల్ల పోయింది. జయ ఎప్పుడో కానీ ఇంటి సంగతులు చెప్పదు. చదువు రాక పోవడం వల్ల ఆడవాళ్లకి ఎన్ని కష్టాలు తన జీవితం ఎంత బాగుంది. ఆడ వాళ్లకి తమ హక్కులు పూర్తిగా తెలియాలి. తను పెళ్లికి ముందే తన కాబోయే భర్తని ఇంటర్వ్యూ చేసింది. తన అభిప్రాయాలన్నీ పూర్తిగా చెప్పింది. ఇద్దరూ సమంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంటి ఖర్చు, ఇంట్లో పనీ అన్నీ సమంగా పంచు కోవాలి. అంతే కానీ బాధ్యత లన్నీ ఆడవాళ్లకీ, క్లబ్బుల్లో తాగుడూ, పేకాట మగ వాళ్లకి కాకూడదు. తను చెప్పిన వన్నీ ఒప్పు కున్నాకనే పెళ్లి చేసుకుంది తను. పాపం జయ, చదువు రాదు. అందుకే మగాడి దురాగతాలన్నీ చెల్లు తున్నాయి.

****

మళ్ళీ శనివారం రాధిక చేతిలో రెండు వేల రూపాయలు పెట్టింది జయ.

"మీ దగ్గరుంచండమ్మా. చీటీ పాట ఈరోజేనని మా ఆయనకు తెలుసు. రాత్రి వచ్చి పైసలడుగు తాడు. ఇంట్లో వుంటేపట్టుకు పోతాడు. మీ దగ్గరైతే తీసు కోలేడు కదా. నా కష్టం వాడితాగుడు కెందుకివ్వాలి?"

"మరి ఊరు కుంటాడా?"

"ఏముందమ్మా తిడతాడు కొడతాడు పైసలట్టుకు పోలేడు కదా"

"అంతగా తిడితే కొడితే ఎందుకు ఊరు కొంటావు. అలాంటి వెధవతో కాపురం చేసే దేమిటీ? ఒక్కరోజు పేకాడితే నేనయితే ఊరుకోను తెలుసా. మా ఆయన దగ్గర నేనే వంద రూపాయలు పైన వసూలు చేస్తాను. నువ్వు నీ డబ్బు లట్టుకు పోయి తాగితే ఎందుకు పడి వుంటావు. వాడిని వదిలెయ్యి"

రాధిక ఈ మాటలు అన కుండానే జయ చెప్పింది.

"మా వోళ్లంతా వాడిని వదిలెయ్య మంటారు. బస్తీలో వాళ్లూ అదే అంటారు. వదిలేస్తే ఏముందమ్మా. మంచో చెడో పెండ్లి చేసు కున్నాను. ఇంక అడితోటే బతకాలి. మొగోడంటూ వున్నాడు కాబట్టే మా బస్తీలో ఎవరూ నాకేసి చూడడం లేదు. లేకపోతే ఏముందమ్మా అందరు మొగాళ్లు నమిలి మింగేస్తారు"

కేవలం ఈ మాన రక్షణ కోసం మగవాడి కాళ్ల దగ్గర అంతగా పడుంది. రాధిక కెందుకో ఆ నిజం చాలా చేదుగా అనిపించింది. తనలా చదువు కుని ఉద్యోగం చేస్తుంటే ఏ వర్కింగ్ ఉమెన్సు హాస్టల్లోనో వుండచ్చు. అపుడీ అవసరం వుండేది కాదు. మాట మారుస్తూ అంది రాధిక.

"ఎవడైనా స్టీలు సామాన్ల వాడొస్తే పిలు" జయ అయిష్టంగా మొహం పెట్టింది.

"నా పాత చీరలు, పిల్లల బట్టలూ నీకే ఇస్తున్నానుగా. ఏవో పాత నూలు చీరలు, లుంగీలు, నావి నైటీలు వున్నాయి. అవి నీ కెలాగూ పనికి రావు. ఇంట్లో చోటు కలిసి వస్తుంది. ఈసారి కనబడితే పిలు"

జయ మాట్లాడ లేదు.

*****

నాలుగు రోజులు పోయాక జయని ఇంకా డబ్బు తీసి కెళ్ల లేదేమని అడిగింది రాధిక. జయ సిగ్గు పడింది.

"నాకు నెల తప్పిందమ్మా. కానుపు టైంకి పనికి రాలేను కదా. ఇపుడైతే మీరు అందరూ ఇచ్చిన అన్నంతో తింటున్నాము. అపుడు అన్నీ కొనుక్కుని తినాలి. మీ దగ్గర్నే వుంచండి. పైసలపుడు పనికి వస్తాయి"

ఏం కంటారీ చదువురాని లేబర్ క్లాస్ ఆడవాళ్లు? తన అమ్మాయి లిద్దరికీ నాలుగేళ్ల తేడా. వీళ్లకి ఫామిలీ ప్లానింగ్ ఏం తెలియదు. రాధిక ఆలో చిస్తుంది. జయ రాధిక మౌనాన్ని ఇంకోలా అర్థం చేసుకుంది.

"ఫరవా లేదమ్మా. ఆ రెండు నెలలకీ ఎవర్నయినా పెడతాను మెల్లిగా. చేయించు కోండి. ఆ తరువాత నుంచి నేనే చేస్తా"

తమలా వీళ్లకి మెటర్నిటీ లీవు వుండదు. నేను నా సంగతి ఆలో చించడం లేదు. మీ పెద్ద పాపకింగా రెండేళ్లు నిండ లేదు కదా. అపుడే మళ్ళీనా అని ఆలో చిస్తున్నా"

"ఏం చెయ్యనమ్మా. ఓపి కుండగానే కనాలి. రేపు కానుపనే దాకా వచ్చి చెయ్యాలి పని. మళ్ళీ రెండు నెలలకే పని చేసు కోవాలి. లేకపోతే ఇల్లు గడవ దమ్మా. ఈసారి కాను పవగానే ఆపరేషన్ చేయించు కుంటా. చిన్న పుడైతే మంచిది కదా. టీవీలో చూస్తున్నా.

రాధిక ఎంతో సంతోషించింది ప్రభుత్వ ప్రచారం ఈ మాత్రం పనిచేస్తోందని.

"నువ్వు సినిమాలే చూస్తావను కొన్నాను"

"లేదమ్మా అన్నీ చూస్తాను. అమ్మా పాత బట్టలు సామాను కివ్వ కండమ్మా. మొన్ననే చెప్దామను కున్నాను సిగ్గేసింది. నా కివ్వండమ్మా. కానుపుకు పని కొస్తాయి"

"అలాగే తీసుకుందువు గానీ"

తరువాత శనివారం ఇల్లు తుడుస్తూ అంది జయ.

"నిన్న నాకూ మా ఆయనకు పెద్ద పోట్లా టైందమ్మా"

ఏముంది తాగడానికి డబ్బడిగి వుంటాడను కుంది రాధిక.

"నేను ఆపరేషన్ చేయించు కుంటా నన్నాను కదా. మగ పిల్లోడైతే చేయించుకో నాకు కొడుకు కావాల అంటాడు. ఎవరైతే నేమిటి నేను ఆపరేషన్ చేయించు కుంటా నేను అన్నాను. పెద్ద గొడవయి పోయింది.

ప్రతి చోటు వుండే గొడవే అను కుంది.

"కూతురి కున్న ప్రేమ కూడా కొడు క్కుండదమ్మా. ఇరవై ఏండ్లు మనం అన్నం పెడదాం. ఒక్కరోజు పెడతది కోడలు. ఆ ఒక్క రోజుకే దాని మనిషై పోతాడు. ఇరవై ఏండ్లు పెట్టిన మనం యాదే వుండం. మా అన్న గాజు ఫిటింగులు కిటికీ లకు చేస్తాడు మా అమ్మ, నాన్న ఇంటి దిక్కైనా చూడడు. ఎందుకు వచ్చిన మొగ బిడ్డలు. నాకు కొడుకైనా, కూతురైనా ఒక్కటే.

జయ మాటలు నిజమే అనుకుంది రాధిక. తన అత్తగారూ, మావ గారు పల్లెటూళ్లో వున్నరు. అయిదుగురు కొడుకుల్లో ఎవరు చూస్తున్నారు. కోడలి మాటకు ఎదురు చెప్ప కుండా వుండి కనుక తన తల్లిని అన్నయ్య ఇంట్లో వుండ నిస్తున్నాడు. కొడుకు వంశోద్ధారకుడు అనుకోడం దండగ అనుకుంది.

"మా ఆయనతో గట్టిగా చెప్పినా, ఈసారి నేనే పోయి ఆపరేషన్ చేయించు కుంటా. మొగోడి సంతకం కూడా అక్కర్లేదుటగా"

ఫరవా లేదు చదువు రాక పోయినా టీవీ ధర్మమాని దీనికి విషయాలు బాగానే తెలుస్తున్నాయి అనుకుంది రాధిక.

*****

"మళ్ళీ పోట్లాటయిందమ్మా మా ఇంట్లో" అని జయ ఇల్లు తుడుస్తూ. "ఆడ పిల్లలయితే ఆపరేషన్ వద్దంటాడు మా ఆయన ఆపరేషన్ చేయించు కుంటే ఒగే స్తానన్నాడు. ఒగ్గేస్తే ఒగ్గేయి అన్నాన్నేను. నా కష్టం నేను చేసు కుంటున్నా. మీ ఇండ్ల మీ ఇండ్ల అన్నం తీసికెళ్లి వాడికి పెడు తున్నాను. వాడు నీకు చేస్తున్నదే ముంది. నేను ఇంక పిల్లల్ని కనలేనమ్మా. ఇంట్లో పని, మీ ఇండ్లో పని. నా కష్టం వాడికేం తెలుస్తుంది. మొగోడికేం తెలుసమ్మా. ఆ ఒక్క పనీ తప్ప" అంత పచ్చిగా మాట్లాడు తుంటే రాధిక చాలా సిగ్గు పడింది. ఎంత కష్ట ముంటే తప్ప అలా సిగ్గు విడిచి మాట్లాడు తుంది. తను చదువు కున్నవాళ్లలో మగవాళ్లు బాధ్యత పంచు కుంటారు వీళ్లకే ముంది?

"మళ్ళీ ఓసారి చెప్పి చూడు. మీ ఆయనకి కొడుకు, కూతురూ ఒక్కటేనని"

"ఇంక చెప్పేదేం లేదమ్మా. ఏమైనా నేను ఆపరేషన్ చేయించు కుంటా. కొడు కేమిటి కూతురేమిటి నువ్వేమైనా మీ అమ్మనీ, నాన్ననీ చూస్తున్నావా అని అడిగినా. వాడు మాట్లాడ లేదు. కోపమొచ్చి ఇంట్లోంచి పోయి తాగేసి వచ్చినాడు"

ఆరు నెలల తర్వాత...

కానుపయిందని జయ కబురు పెట్టింది ఇంకో పని పిల్ల చేత. మర్నాడు జయ తల్లి వచ్చింది పాత బట్టల కోసం ఇస్తూ అడిగింది.

"ఆడపిల్లా, మగపిల్లాడా"

"ఆడ పిల్లేనమ్మా. అచ్చం వాళ్లమ్మ లాగుంది" జయ ఆపరేషన్ ఏమయిందు అను కొంది రాధిక. మూడు రోజుల తర్వాత దాచు కున్న డబ్బు కోసం వచ్చింది జయ తల్లి. డబ్బిస్తూ అడిగింది రాధిక.

"ఇంటి కొచ్చిందా జయ?"

"లేదమ్మా ఆపరేషన్ అయిందిగా. మూడోజుల క్యాంప్ ఇంటికి పంపించరట"

"మీ అల్లుడొప్పు కున్నాడా?"

"వాడు ఒప్పు కునేదేంటీ? నా బిడ్డే చేయించు కుంది. నేను దగ్గరనే వున్నా. ముందు వాడికి కోప మొచ్చింది. ఇపుడు పుట్టిన పాపను చూశాడు. కోప మంతా పోయింది. జయకు మందులు కూడా వాడే తెచ్చాడు.

జయ తల్లి వెళ్లిపోయింది. రాధిక మెల్లిగా లోపలి కొచ్చి కూచుంది. ఎదురుగా టేబిలు మీద లేడీ డాక్టరు రాసిచ్చిన మందు చీటీ కనిపిస్తోంది. ఎంత ధైర్యం చేసింది జయ. ఏమాత్రం చదువు రాని జయ. తను భర్తతో సమంగా చదువు కుంది. భర్తతో సమంగా ఉద్యోగం చేస్తుంది. భర్తతో సమంగా జీతం తెస్తోంది. భర్త చేత ఇంటి పని సమంగా చేయిస్తోంది. కానీ ఇద్దరి ఆడ పిల్లల తర్వాత జయ చేసిన పని తనెందుకు చెయ్య లేదు?"

పుట్టింటికి పంపిస్తూ "మగ పిల్లాడైతే చేయించు కో ఆడపిల్లయితే ఆలో చిద్దాం" అన్నాడు భర్త. అల్లుడిని కాదని ఏం చెయ్యాలమ్మా అంది అమ్మ. అమ్మాయి పుట్టిన వెంటనే తనంత తను ధైర్యం చేయలేక పోయింది. నాలుగేళ్ల నుంచి ఎవరైనా ఒకటేనని చెప్పడానికి ప్రయత్నించింది ఎవరికి ఓడి పోయింది. అందుకే మూడో నెల, మందుల చీటీలు, మళ్ళీ మగ పిల్లాడికై ఆరాటం.

జయ చేసిన పని తనెందుకు చేయ లేదు? సమానత్వం మీద కాలేజీలో లెక్చర్లిచ్చిన తను, కాపురంలో భర్తతో అన్నిటా సమాన మన్న తను, చివరకు ఈ విషయంలో సమానత్వం దగ్గర వెనుకంజ యింది. ఎక్కడుంది సమానత? చదువు లోనా? ఉద్యోగం లోనా? ఇంటి పని లోనా? ఏమో? పుట్టే పిల్లల విషయంలో మాత్రం కాదు.

మందుల చీటీ ఫక్కున నవ్వినట్లనిపిం చింది రాధికకు.